క్లుప్తంగా

నాణేలతో క్రికెట్ వరల్డ్ కప్ నమూనా



అమరావతి: పురుషుల క్రికెట్ వరల్డ్ కప్ నేపథ్యంలో దేశ వ్యాప్తంగా క్రీడాభిమానం నెలకొంది. ధరణికోట అగస్టీన్ హైస్కూల్లో విద్యార్థులు గొల్లపల్లి వెంకటశివ, గొల్లపల్లి నాగశ్రీకర్ రూపాయి, రెండు రూపాయల నాణేలతో వరల్డ్ కప్ నమూనాను తయారు చేశారు. శనివారం హైస్కూల్లో విద్యార్థులు మాట్లాడుతూ.. ఫైనల్‌లో ఆస్ట్రేలియాపై గెలిచి భారత్ వరల్డ్ కప్ సాధించాలని ఆకాంక్షించారు.

ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన



ఇరుకుపాలెం(ముప్పాళ్ళ): ఇరుకుపాలెం గ్రామ ఎంపీయూపీ పాఠశాలలో బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా డీబీఆర్సీ ఆధ్వర్యంలో ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డీబీఆర్సీ కో–ఆర్డినేటర్ మేడే వెంకటరమణ దిన చర్యలో భాగంగా పాటించాల్సిన ఆరోగ్య నియమాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థినులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎ.రోజా రాణి, పాఠశాల ప్రదానోపాధ్యాయురాలు పద్మశ్రీ, వైఎస్సార్ సీపీ నాయకులు బత్తుల రామకృష్ణ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ హరి ప్రియ, ఎంఎల్‌హెచ్‌పీ శిరీష పాల్గొన్నారు.

అనుమానాస్పద మృతిపై కేసు నమోదు



నకరికల్లు: దేచవరం గ్రామానికి చెందిన వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఎ.బాలకృష్ణ శనివారం తెలిపారు. గ్రామానికి చెందిన వజ్రాల అంజిరెడ్డి(32), తను కౌలుకు తీసుకొన్న పొలానికి శుక్రవారం సాయంత్రం వెళ్లాడు. పొలంలోనే నురగలుగక్కుతూ పడి ఉండటాన్ని గుర్తించిన స్థానికులు గ్రామంలోని ఆర్ఎంపీ వైద్యుని వద్దకు తరలించారు. అప్పటికే అతను మృతి చెందినట్లు తెలిపారు. విష పురుగు కాని పాముకాటుకు గాని గురై ఉంటాడని మృతుని భార్య వెంకటేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పశు వైద్యశాల భవనం ప్రారంభం



అచ్చంపేట: మండలంలోని కోనూరులో గోళ్లమూడి అచ్యుత రామారావు దాతృత్వం రూ.7 లక్షల వ్యయంతో నిర్మించిన పశు వైద్యశాల భవనాన్ని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ఎస్.కాంతారావు, సహాయ సంచాలకులు వెంకట్రామయ్య శనివారం ప్రారంభించారు. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే దాతలు ముందుకు రావాలన్నారు. ప్రతి ఒక్కరూ గోళ్లమూడి అచ్యుత రామారావును ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు. ఈ సందర్భంగా దాత రామారావును అధికారులు, గ్రామ ప్రముఖులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఏకుల రాములు, పశుసంవర్ధక శాఖ డీడీ రామారావు, ఏహెచ్‌ఏడీ నరసింహం, వెంకట్రామయ్య, మండల పశువైద్యాధికారిణి పి.స్వాతి దేవి, పీఎల్‌ఓ సువర్ణ, గ్రామ మాజీ సర్పంచ్ తాళ్లూరి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కుల గణనకు సహకరించాలి

నరసరావుపేట: రాష్ట్రంలో ప్రభుత్వం చేపట్టిన కులగణన ద్వారా బీసీలకు రాజ్యాధికారం పొందే అవకాశం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కల్పించారని ఏపీ రాష్ట్ర బొందిలి సంఘ కార్యనిర్వాహక కార్యదర్శి బొందిలి శ్రీనివాససింగ్ శనివారం పేర్కొన్నారు. సుమారు 92 ఏళ్ల అనంతరం కులగణన చేపట్టడం జరిగిందన్నారు. ఈ గణన ద్వారా ఏ కులం వారు ఎంతమంది ఉన్నారనే విషయం స్పష్టమౌతుందన్నారు. ఇప్పటి వరకు అసెంబ్లీలో అడుగు పెట్టని కులాలకి ఎమ్మెల్యేగా ప్రవేశించే అవకాశం ఏర్పడుతుందన్నారు. విద్య, ఉద్యోగాలో ఎక్కువ అవకాశాలు వస్తాయన్నారు. కులగణనని పెద పండుగగా భావించి అందరూ బాధ్యతగా ప్రభుత్వానికి సహకరించి వినియోగించుకోవాలని కోరారు.

బాల్య వివాహాలు నేరం

బొల్లాపల్లి : ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని గుమ్మనంపాడు జడ్పీహైస్కూల్‌లో బాల్య వివాహ నిరోధక చట్టంపై అవగాహన నిర్వహించారు. హైస్కూల్ హెచ్‌ఎం కె. రమాదేవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఇ. శ్రీదేవి బాల్య మాట్లాడుతూ.. బాల్య వివాహాలు నిర్వహిస్తే చట్టరీత్యా నేరమని తెలిపారు. ఆడపిల్లలను రక్షిద్దాం, చదివిద్దాం అనే నినాదంతో విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలుకు మళ్లీ జగనే రావాలి

రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

రాజుపాలెం: కులమతాలకు, పార్టీలకు అతీతంగా అనేక సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అందించినందుకే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరలా రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. మండలంలోని అంచులవారిపాలెం గ్రామంలో వైఏపీ నీడ్స్ జగన్ అనే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు సర్పంచ్ అంచుల రామాంజనేయులు అధ్యక్షత వహించారు. సమావేశంలో మంత్రి అంబటి పాల్గొని, మాట్లాడారు. ప్రతీ గ్రామంలో సచివాలయాలు, హెల్త్ సెంటర్‌లు, ఆర్‌బీకేలు ప్రజలకు అందుబాటులో ఏర్పాటు చేశారు కాబట్టే..మరలా జగనన్నే ముఖ్యమంత్రి కావాలని అన్నారు. పేద పిల్లలు ఉన్నతమైన చదువులు చదవాలని నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయికి తెచ్చారని, జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రతీ గ్రామంలో ఇంటింటికి వైద్య సేవలు అందించినందుకే జగనన్న రాష్ట్రానికి అవసరమని చెప్పాలని ఆయన దిశానిర్దేశం చేశారు. ఇచ్చిన మాట ప్రకారం 98 శాతం సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు చేశారు కాబట్టే గుండె మీద చేయివేసుకుని ఓటు అడిగే హక్కు వైఎస్సార్ పార్టీ కార్యకర్తకే ఉందని గర్వంగా చెప్పారు. ఒకసారి పవన్ కల్యాణ్, చంద్రబాబుకు మద్దతు ఇవ్వబట్టే దుర్మార్గపు పాలన ప్రజలకు అందించారని విమర్శించారు. రాజకీయాలలో విలువలు లేని వ్యక్తి పవన్ కల్యాణ్ అని మంత్రి మండిపడ్డారు. మళ్లీ రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేస్తామని ధైర్యంగా చెప్పారు. కరోనా కాలంలో సత్తెనపల్లి నియోజకవర్గంలో ప్రజలను అనేక విధాలుగా ఆదుకున్నానని, అందువల్లే తనను కూడా ఆశీర్వదించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వరరెడ్డి, గుంటూరు మిర్చి యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు పక్కాల సూరిబాబు గ్రామంలో జరిగిన సంక్షేమ, అభివృద్ధి పథకాల వివరాలతో డిస్ప్లే బోర్డును ఆవిష్కరించారు. ప్రధాన కూడలిలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు బాసు లింగారెడ్డి, మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు, ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరి చంద్రమౌళి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ దొంతిరెడ్డి సునీత శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీ హరి సూరమ్మ నాగేశ్వరరావు, జేసీఎస్ కన్వీనర్ పులిబండ్ల అశోక్, జీడీసీఎంసీ డైరెక్టర్ పాలవాయి ఆదినారాయణ పాల్గొన్నారు.

అధికారులంతా సమన్వయంతో పనిచేయాలి

మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ రజనీబాయి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రజనీబాయి

అచ్చంపేట: అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులందరికి అందేలా చూడాలని ఎంపీపీ భూక్యా రజనీబాయి అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. అంధికారులంతా ప్రజలకు అందుబాటులో ఉండాలని, ప్రజలకు జవాబుదారి విధానంతో మెలగాలని చెప్పారు. జెడ్పీటీసీ సభ్యులు తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ ప్రధాన శాఖలకు సంబంధించిన అధికారులు సమావేశానికి రాకపోవడం దురదృష్టకరమన్నారు. ముఖ్యంగా విద్యుత్, రెవెన్యూ శాఖల గైర్హాజరుపై అసహనం వ్యక్తం చేశారు. ఎంపీడీవో పి.శివసుబ్రమణ్యం మాట్లాడుతూ రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని ప్రతి గ్రామ పంచాయతీలో విధిగా నిర్వహించి, భారత రాజ్యాంగపట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. వచ్చే సంవత్సరం నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. పంచాయతీ కార్యదర్శులు తమ గ్రామాలలో అన్ని చేతి పంపులు సక్రమంగా పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఇన్నారావు మాట్లాడుతూ ఇటీవల గ్రామాలలో నిర్వహించిన జగనన్న సురక్ష వైద్య శిబిరాలలో 5,726మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. 75 మందికి కంటి ఆపరేషన్లు చేయించామన్నారు. తాడువాయి అంగన్‌వాడీ కేంద్రంలో మరుగుదొడ్లు నిర్మించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కోరారు. ఈ ఏడాది వర్షాలు తక్కువగా ఉండటంవల్ల సాగునీటిని పొదుపుగా వాడుకోవాలని ఇరిగేషన్ ఏఈ చిల్కా భాస్కర్ కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు గంగసాని బాబు, తెల్లమేకల నాగరాజు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

నాణ్యతకు, మన్నికకు భారతీ సిమెంట్



మేస్త్రికి బీమా బాండ్ అందజేత

పెదకూరపాడు: భవన నిర్మానాలు శాశ్వతమైనవని, నిర్మాణం కోసం సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి తయారు చేయబడిన నాణ్యమైన సిమెంట్‌ను ఎంచుకోవాలని భారతి సిమెంట్స్ అసిస్టెంట్ మేనేజర్ (మార్కెటింగ్) పూల సురేష్ , సీనియర్ టెక్నికల్ ఆఫీసర్ ఎస్. భవానీ శంకర్ సూచించారు. 75త్యాళ్ళూరులో శనివారం శ్రీ సాయి లక్ష్మీ ఎజెన్సీ సహకారంతో భారతి సింమెంట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో భవన నిర్మాణ మేస్త్రీలు, కార్మికులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సురేష్ మాట్లాడుతూ ఆధునాతన పరిజ్ఞానంతో భారతి సిమెంట్ తయారువుతుందని తెలిపారు. భవానీ శంకర్ మాట్లాడుతూ భారతి సిమెంట్ వినియోగించిన కాంక్రీట్ శ్లాబులను ఏడు రోజుల అనంతరం తమ కంపెనీ ప్రతినిధులు వచ్చి నాణ్యతా పరీక్షలు చేసి, నాణ్యతను భవన నిర్మాణ మేస్త్రీలు, యజమానులకు వివరిస్తామని చెప్పారు. సదస్సుకు హాజరైన మేస్త్రీలు, కార్మికులకు రూ.లక్ష చొప్పున ఉచిత బీమా సదుపాయం కల్పించి, బాండ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీసాయి లక్ష్మీ ఏజెన్సీ యజమాని ముకల లక్ష్మారెడ్డి, డీలర్లు పాల్గొన్నారు.

రీ–సర్వే పనులు పెండింగ్ లేకుండా చూడండి

–జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్



పెదకూరపాడు: ఫేజ్–3 రీ సర్వే పనులు పెండింగ్ లేకుండా రెవెన్యూ సిబ్బంది పని చేయాలని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాం ప్రసాద్ సూచించారు. శనివారం పెదకూరపాడు తహసీల్దారు కార్యాయలంలో ఆయన రెవెన్యూ సిబ్బందితో రీ–సర్వే, ఎలక్షన్ పనులపై సమావేశం నిర్వహించారు. గ్రామాల వారీగా సమీక్ష నిర్వహించారు. ఎలక్షన్ పనులను పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని ఆదేశించారు. నూతన ఓటర్లను చేరి్పంచాలని, యువతీ, యువకుల పేర్లను కొత్తగా నమోదు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు జియా ఉల్ హుక్ పాల్గొన్నారు.

‘ఆడదాం ఆంధ్ర’పై సమీక్ష



అమరావతి: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం ‘ఆడుదాం ఆంధ్ర’పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీపీ మేకల హనుమంతరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో విజయవంతం చేయాలని కోరారు. క్రికెట్, కబడ్డీ, ఖో–ఖో, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో విరివిగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎంపీడీవో పావులూరు ఉమాదేవి మండలంలోని అన్ని పాఠశాలల పీఈటీలు, పీడీలు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు పరామర్శ

మాదల(ముప్పాళ్ళ): మాదల గ్రామంలో గత వారం అగ్నిప్రమాదానికి గురైన దుకాణ యజమానిని రాష్ట్ర ఎన్విరాన్‌మెంట్ కమిటీ చైర్మన్ గుబ్బా చంద్రశేఖర్ శనివారం పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును దుకాణ యజమాని పొట్టి శ్రీనివాసరావును అడిగి తెలుసుకున్నారు. తనవంతు ఆర్థిక సాయం అందిస్తానని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు రావిక్రింది వెంకటసుబ్బారావు, పొట్టి మల్లికార్జునరావు, రమేష్, శంకరు, మహంకాళరావు, నరసింహారావు తదితరులు ఉన్నారు.

రాయితీపై శనగ విత్తనాల పంపిణీ



రైతులకు సూచనలిస్తున్న ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు, ఏఓ దేవదాసు

నకరికల్లు: విత్తన శుద్ధి చేయడం ద్వారా వేరు కుళ్లు తెగులు రాకుండా అరికట్టవచ్చని ఏడీఏ బి.శ్రీకృష్ణదేవరాయలు సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో 40 శాతం రాయితీపై శనగల విత్తనాలను రైతులకు శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనగలు కిలోకు మూడు గ్రాముల కెప్టెన్ లేదా థైరం లేదా 10 గ్రాముల ట్రైకోడెర్మావిరిడి కలిపి విత్తన శుద్ధి చేయాలని సూచించారు. ఎకరాకు 30 నుంచి 35 కేజీల విత్తనాలు విత్తుకోవచ్చని అన్నారు. మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు మాట్లాడుతూ మండలంలోని నకరికల్లు, చల్లగుండ్ల, చీమలమర్రి, కండ్లకుంట, రూపెనగుంట్ల, దేచవరం, కుంకలగుంట, చేజర్ల గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల ద్వారా బేజీ–11 రకం శనగ విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కేజీ శనగల ధర రూ.81లు కాగా 40 శాతం రాయితీపై రూ.48.60కే రైతులకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఎంపీటీసీ సభ్యుడు గోపు పద్మావతి అంజిరెడ్డి, వీఏఏలు కె.దిలీప్‌కుమార్, కె.రవిబాబు, రైతులు పాల్గొన్నారు.

కంది పంటతో లాభాలు

నకరికల్లు: కందిపంటలో సకాలంలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే తక్కువ ఖర్చులో అధిక దిగుబడులు సాధించవచ్చని సహాయ వ్యవసాయ సంచాలకుడు బి.శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం శనివారం నిర్వహించారు. కందిసాగులో ఉన్న పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కంది సాగు రైతులతో మాట్లాడుతూ.. సాగర్ నీటి లభ్యత లేనపుడు వర్షాధారంగా కంది సాగు చేయడం లాభదాయకంగా ఉంటుందని చెప్పారు. తెగుళ్ల సోకకుండా సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు, సిబ్బంది పాల్గొన్నారు.

చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు



వ్యాస రచనలో పాల్గొన్న విద్యార్థులు

నకరికల్లు: చిత్రలేఖనం, వ్యాసరచన ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత మెరుగుపడుతుందని గ్రంథాలయాధికారి కేసరి రమణారెడ్డి అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు శనివారం నిర్వహించారు. నిత్యం గ్రంథాలయానికి రావడం అలవాటుగా మార్చుకోవాలని, పాఠ్యపుస్తకాలతో పాటు దిన పత్రికలు, పోటీ పరీక్షల పుస్తకాలు, మెదడుకు పదును పెట్టే పజిల్స్ పుస్తకాలు చదివి వృద్ధిలోకి రావాలని సూచించారు. పోటీల్లో ప్రతిభను చాటిన వారికి ఈ నెల 20న బహుమతులు పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.నగేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

క్రోసూరు: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా శనివారం స్థానిక గ్రంథాలయ అధికారిణి వై.వీరాంజమ్మ ఆధ్వర్యంలో విద్యార్థులకు పర్యావరణ కాలుష్యం, మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్ఫలితాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. పోటీలలో గెలుపొందిన విజేతలకు ముగింపు వారోత్సవాల రోజున బహుమతులు అందజేస్తామని వీరాంజమ్మ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాఠకులు పాల్గొన్నారు.


విద్యార్థులకు క్విజ్ పోటీలు

సత్తెనపల్లి: పట్టణంలోని వైఎస్సార్ మెమోరియల్ శాఖ గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగి కొరబండి ఆంతోని, విశ్రాంత అధ్యాపకుడు సీహెచ్ ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు దేశభక్తి గేయాలు, క్విజ్, స్టోరీ టెల్లింగ్, కంఠస్థ పద్యాల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, సుగాలి కాలనీ జెడ్పీ ఉన్నత పాఠశాల, శ్రీ సరస్వతీ శిశు మందిర్, భవిష్య పాఠశాల విద్యార్థులు హాజరయ్యారు.


గ్రంథాలయాలను వినియోగించుకోవాలి

పెదకూరపాడు: ప్రతి విద్యార్థి గ్రంథాలయాలను వినియోగించుకొని జ్ఞానం పెంపొందించుకోవాలని జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమణరావు అన్నారు. గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా శనివారం జెడ్పీ పాఠశాల నందు విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. లైబ్రేరియన్ కోత్రపాటి వాణి , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ మండలాధ్యక్షుడిగా రవీంద్రనాథ్ ఠాగూర్



అవ్వారి రవీంద్ర నాథ్ ఠాగూర్



నంబుల విష్ణుమూర్తి

సత్తెనపల్లి: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) మండల అధ్యక్షుడిగా పట్టణంలోని ఎంపీపీఎస్ రైలుపేట ఉపాధ్యాయుడు అవ్వారి రవీంద్రనాథ్ ఠాగూర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన మండల మహా సభలో 2023–24 సంవత్సరానికి నూతన మండల కమిటీ ఎన్నిక జరిగింది. నూతన కమిటీని ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ప్రధాన కార్యదర్శి గుబ్బ విజయసారథి శనివారం ప్రకటించారు. గౌరవ అధ్యక్షుడిగా పొన్నం వెంకటేశ్వర్లు (ఎంపీయూపీఎస్, కంటేపూడి), సహాధ్యక్షుడిగా పాలెపోగు రమేష్ బాబు (ఎంపీపీఎస్ ఎస్సీ–1, కట్టమూరు), మహిళా సహాధ్యక్షులుగా కొచ్చర్ల రిబ్కా (ఎంపీపీఎస్ వీఆర్ నగర్), ప్రధాన కార్యదర్శిగా నంబుల విష్ణుమూర్తి (ఎంపీపీఎస్ కొత్త గోరంట్ల), కోశాధికారిగా బీవీ శేశిరెడ్డి (జెడ్పీ హెచ్ఎస్ అబ్బూరు), మండల కార్యదర్శులుగా షేక్.సాయిబాబు, ఎం. శ్రీనివాసరావు, ఎన్‌వీ భాస్కర్, అన్వర్, డి.రాంప్రసాద్, వెంకటనారాయణ, షేక్ ముస్తఫా, ఎస్డీ సయ్యద్, షేక్ బాజీ, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా బొర్రా వెంకట్రావు, పీవీ కోటేశ్వరరావు, దాసరి తోమాసయ్య, ఎస్‌డీ తాజుద్దీన్, ఎం.భద్రయ్య, పుప్పాల వెంకటేశ్వర్లు, ఎస్‌డీ సలీం, ఎం.నిర్మల, ఎ.శ్రీనివాసరెడ్డి, టి.శేషగిరిరావు, జానకిదేవి ఎన్నికయ్యారు.

చదువుతోనే సమాజంపై అవగాహన



మాట్లాడుతున్న సీడీపీవో శ్రీలత

సత్తెనపల్లి: బాలికలు చదువుకొని అన్ని రంగాల్లో రాణించాలని సీడీపీఓ టి.శ్రీలత అన్నారు. బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా సత్తెనపల్లి ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపంలో శనివారం నియోజకవర్గస్థాయిలో నిర్వహించిన బాలికల హక్కులపై అవగాహన సదస్సులో ఆమె పాల్గొని, మాట్లాడారు. సీడీపీఓ శ్రీలత మాట్లాడుతూ ప్రతి బాలిక చదువుకోవాలని, చదువుకుంటే సమాజంపై అవగాహన ఉంటుందన్నారు. బాల్యంలో వివాహాలు చేసుకోవడం వల్ల అనేక అనర్థాలు దాపురిస్తాయని, అవి చట్టరీత్యా నేరమన్నారు. భారత ప్రభుత్వ చట్టప్రకారం బాలికలకు 18 సంవత్సరాల లోపు, బాలురకు 21 సంవత్సరాల లోపు వయసు ఉన్నవారికి వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. ప్రభుత్వం కేజీ నుంచి పీజీ వరకు చదువుకునేందుకు ప్రోత్సాహం అందిస్తుందని, చదువుకునే సమయంలో అమ్మ ఒడి, పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం వంటి అనేక విధాలుగా తోడ్పాటును అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా గుడ్డు టచ్ బ్యాడ్ టచ్, బేటి బచావో బేటి పడావో తదితర వాటిపై అవగాహన కల్పించారు. సదస్సులో మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, డీసీపీఓ విజయ్ కుమార్, ఎస్‌ఐ సంధ్యారాణి మాట్లాడారు. సదస్సుకు ఏసీడీపీఓ సంతోషకుమారి అధ్యక్షత వహించారు. విద్యార్థినులతో బాల్య వివాహాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు, దళిత బహుజన రిసోర్స్ సెంటర్ రీజినల్ కో–ఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప, ఐసీడీఎస్ సూపర్వైజర్లు, మహిళా పోలీస్ సిబ్బంది, విద్యార్థినిలు, తదితరులు ఉన్నారు.

గ్రామ విత్తన పథకంపై శిక్షణ



లింగాపురంలో వరి పంట పరిశీలన

అమరావతి: మండల పరిధిలోని లింగాపురంలో గ్రామ విత్తన పథకంపై మండల స్థాయి శిక్షణ కార్యక్రమం శనివారం జరిగింది. వ్యవసాయశాఖ ఏడీఏ వి.హనుమంతరావు, ఎంపీపీ మేకల హనుమంతరావు పాల్గొన్నారు. ఎంపీపీ హనుమంతరావు రైతులనుద్దేశించి మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యం ఇవ్వటం జరగిందని, ప్రతి గ్రామంలో రైతు భరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేసి విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్స్, హార్టి కల్చర్ అసిస్టెంట్స్‌ను నియమించారని తెలిపారు. విత్తు నుంచి పంట చేతికొచ్చే వరకు సహాయ సహకారాలు అందించి, రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం పాటుపడుతోందన్నారు. పంట బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లిస్తుందని, ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టం జరిగితే బీమా డబ్బులు వస్తున్నాయన్నారు. ఇది రైతు పక్షపాత ప్రభుత్వమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి చేసిన విత్తనాలతో పండిస్తున్న పంట పొలాలను ఏడీఏ శ్రీనివాసరావుతో కలిసి పరిశీలించారు. ఏఓ షేక్ అహ్మద్, ఏఎస్‌ఓ రామనారాయణ, అగ్రికల్చరల్, హార్టికల్చర్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

భూసారం పెంపుపై వ్యవసాయ కళాశాల విద్యార్థుల అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న కళాశాల విద్యార్థినులు, శాస్త్రవేత్త డా. జి.రమేష్

చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ): ట్రైకోడెర్మావిరిడీ ఉపయోగించడం వల్ల భూసారం పెరుగుతుందని వ్యవసాయ కళాశాల ప్రిన్సిపల్ శాస్త్రవేత్త డా. జి.రమేష్ అన్నారు. మండలంలోని చాగంటివారిపాలెం గ్రామంలో ఆర్ఏడబ్ల్యూపీ(రూరల్ అగ్రికల్చరల్ వర్క్ ఎక్స్‌పీరియన్స్ ప్రోగ్రాం)లో భాగంగా బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు ట్రైకో డెర్మావిరిడీ మల్టిప్లికేషన్‌పై శనివారం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపల్, శాస్త్రవేత్త రమేష్ ట్రైకో డెర్మావిరిడీ అనేది ఒక శిలీంధ్ర నాశిని, మొక్క తెగులుపై జీవ సంరక్షణ నియంత్రణ చేస్తుందని వివరించారు. వేరులో వ్యాపించే ఫంగస్ లాంటి వాటిపై ఆక్రమించి అరికడుతుందని తెలిపారు. వేరు తెగులు, వడలి తెగులు, కాండం తెగులును అధిగమించుకోవచ్చని వివరించారు. ఏరువాక కేంద్రం కో–ఆర్డినేటర్ డా. సీహెచ్ వరప్రసాద్ ట్రైకోడెర్మావిరిడీ ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వ్యవసాయకళాశాల విద్యార్థినులు గ్రామ చిత్రపటాన్ని రంగులతో తయారు చేశారు. వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నేడు బిగ్ స్క్రీన్‌పై క్రికెట్ మ్యాచ్ ప్రసారం

క్రోసూరు: ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆధ్వర్యంలో క్రోసూరు జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఓపెన్ బిగ్ స్క్రీన్‌పై ఆదివారం వరల్డ్ కప్ క్రికెట్ ఫైనల్ మ్యాచ్ ప్రదర్శన జరుగుతుందని ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి దర్శి వెంకటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమయ్యే మ్యాచ్‌ను ఓపెన్ స్క్రీన్ పై తిలకించవచ్చని పేర్కొన్నారు.

పెన్షనర్స్ గదులను తక్షణమే ఖాళీ చేయాలి



మాట్లాడుతున్న కార్యదర్శి మహేష్

సత్తెనపల్లి: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్‌కు సంబంధించిన గదులను తక్షణమే ఖాళీ చేయాలని సీపీఎం మండల కార్యదర్శి పెండ్యాల మహేష్ డిమాండ్ చేశారు. పట్టణంలో పెన్షనర్స్ అసోసియేషన్ చేపడుతున్న ధర్నాకు శనివారం సీపీఎం పట్టణ, మండల కమిటీ మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ లీజు ఒప్పందం తీరిపోయి మూడు సంవత్సరాలు దాటినప్పటికీ గదులను ఖాళీ చేయకుండా పెన్షనర్లను ఇబ్బంది పెట్టడం సరైన పద్ధతి కాదన్నారు. తక్షణమే అధికారులు జోక్యం చేసుకొని పెన్షనర్స్ అసోసియేషన్‌కు సంబంధించిన గదులను ఖాళీ చేయించి వారికి అప్పగించాలన్నారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు, పెన్షనర్లు, తదితరులు ఉన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసుపై డీఎస్పీ విచారణ

పెదకూరపాడు: ఎస్సీ, ఎస్టీ కేసుపై సత్తెనపల్లి డీఎస్పీ శనివారం విచారణ చేపట్టారు. పెదకూరపాడు గ్రామానికి చెందిన గుడిపూడి భాగ్యమ్మ ఫిర్యాదు మేరకు విచారణ చేసినట్లు డీఎస్పీ ఆదినారాయణ తెలిపారు. పెదకూరపాడు ఎస్సీ కాలనీకి చెందిన గుడిపూడి భాగ్యమ్మ అదే గ్రామానికి చెందిన కృష్ణవేణి అనంతలక్ష్మి మధ్య గత కొంతకాలంగా ఆర్థిక పరమైన వివాదం ఉంది. నగదు అడిగేందుకు వెళ్లిన భాగ్యమ్మను కులం పేరుతో దూషించి అవమాన పరిచిన ఘటనపై పెదకూరపాడు పోలీసులకు భాగ్యమ్మ ఫిర్యాదు చేసింది. ఎస్సై వెంకట్రావు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. డీఎస్పీ ఆదినారాయణ స్థానికంగా విచారించి, వివరాలు తీసుకున్నారు.